

ఆధ్యాత్మికతతో ప్రశాంతత
ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. 8లో▸



మంత్రికి శుభాకాంక్షలు
పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కను పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ నేతలు కలిశారు. 8లో▸



ఆటో కార్మికుల ధర్నా
మంచాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు ధర్నా నిర్వహించారు. 8లో▸

న్యూస్‌రీల్

వైద్య సేవలు భేష్



మాచన్‌పల్లిలో వైద్య సేవలను అడిగి తెలుసుకుంటున్న కేంద్ర బృందం సభ్యులు

షాబాద్: క్షేత్రస్థాయిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడం బాగుందని కేంద్ర బృందం కితాబిచ్చింది. మండల పరిధిలోని మాచన్‌పల్లి గ్రామంలో శనివారం బృందం సభ్యులు పర్యటించారు. గర్భిణులకు కాన్పు సమయంలో సేవలు ఎలా అందుతున్నాయో స్థానిక ఏఎన్‌ఎం, ఆశాల ద్వారా ఇంటింటికీ వెళ్లి అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని ఆరా తీశారు. ప్రభుత్వ మోడల్ స్కూల్‌కి వెళ్లి అక్కడ విద్యార్థులకు ఆరోగ్య సేవలు ఎలా అందుతున్నాయని విద్యార్థులు, ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. పర్యటించిన కేంద్ర బృందంలో ఉత్తర ప్రదేశ్ నుంచి డాక్టర్ రాజేశ్‌పటేల్, గుజరాత్ నుంచి డాక్టర్ శ్రీధర్‌రావు తదితరులు ఉన్నారు. వారి వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్, సీహెచ్‌ఓ గోపాల్‌రెడ్డి, వైద్య సిబ్బంది మల్లేష్ ఉన్నారు.

మైసమ్మ సన్నిధిలో కాంగ్రెస్ ఎస్సీసెల్ స్టేట్ కన్వీనర్



కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ స్టేట్ కన్వీనర్‌ను సన్మానించిన నాయకులు

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండిలో కొలువైన మైసమ్మ దేవతను కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ స్టేట్ కన్వీనర్ బండి మధుసూదనరావు, పార్టీ నాయకులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పార్టీ స్థానిక నాయకులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు అశోక్, కర్కల్‌పహాడ్ ఎస్సీసెల్ అధ్యక్షుడు రాజు, నాయకులు శ్రీను, పురుషోత్తం పాల్గొన్నారు.

ధరణిపై నజర్

ఆపరేటర్ల అక్రమాలతో అప్రమత్తం
- పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు
- రికార్డులు చూసిన తర్వాతే ముందడుగు
- క్షేత్రస్థాయి నివేదిక తప్పనిసరి
- తహసీల్దార్లకు కలెక్టర్ ఆదేశాలు
- జిల్లాలో 35 వేలకుపైగా దరఖాస్తులు పెండింగ్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి పాత రికార్డులను ప్రామాణికంగా తీసుకోవాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ధరణిలో నమోదైన అర్జీలను కొలిక్కి తేవడానికి ఆన్‌లైన్ నివేదిక సహా పహాణీ, పట్టాదార్ పాస్‌పుస్తకం తదితర ధ్రువీకరణలు పరిగణనలోకి తీసుకోవాలని సంకల్పించింది. వీటన్నింటితో క్షేత్రస్థాయి నివేదికను తప్పనిసరి చేస్తూ కలెక్టర్ భారతి హోళికేరి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటివరకు ధరణి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో తహసీల్దార్‌కు నివేదించి.. అక్కడి నుంచి నివేదిక కోరేవారు. ఈ నివేదిక ఆధారంగా అర్జీని ఆమోదించాలా? తిరస్కరించాలా అనే దానిపై కలెక్టర్ నిర్ణయం తీసుకునేవారు. ఈ నివేదికలను తమకు అనుకూలంగా మలుచుకుంటున్న కొందరు అక్రమార్కులు తహసీల్దారులతో చేతులు కలపడంతో భూ సమస్యల పరిష్కారంలో పారదర్శకత లోపించింది. తప్పుడు నివేదికలతో భూ యాజమాన్య హక్కులు అసలైన పట్టాదారుకుగాకుండా.. వేరొకరికి దాఖలు పరచాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ముఖ్యంగా నిషేధిత జాబితాలో ఉన్న సర్కారీ భూముల వ్యవహారంలో ఈ అక్రమాలు చోటుచేసుకుంటున్నట్లు తేలింది. 22ఏ నుంచి తీసేసేలా స్థానిక తహసీల్దార్లతో నివేదిక తెప్పించుకొని విలువైన భూములను కొల్లగొడుతున్నట్లు స్పష్టమైంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల ధరణి అర్జీల పరిష్కారంలో అవకతవకలు జరిగినట్లు కలెక్టర్ గుర్తించారు. తమ ప్రమేయంలేకుండానే కిందిస్థాయి అధికారులు లాగిన్ ఐడీలతో అర్జీలకు ఆమోదముద్ర వేయడం సంచలనం సృష్టించింది. సాంకేతిక లోపాలను అసరాగా మలుచుకొని ఈ తతంగానికి పాల్పడినట్లు తేలడంతో అప్రమత్తమైన కలెక్టర్.. నివేదికలను కూలంకషంగా పరిశీలించిన తర్వాతే రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ముందడుగు వేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. సీఎం రేవంత్‌రెడ్డి కూడా ధరణిలో జరుగుతున్న లోటుపాట్లపై ఇటీవల జరిగిన సమీక్షా సమావేశంలో ప్రస్తావించారు. సరైన ధ్రువీకరణలు/ఆధారాల్లేకుండా భూ యజమాన్య హక్కులు బదలాయించడాన్ని తప్పుబట్టారు. ఈ క్రమంలోనే రెవెన్యూయంత్రాంగం ధరణిలో ఉన్నలోపాలను సవరించడమేగాకుండా.. కిందిస్థాయి నుంచి వచ్చే నివేదికలను కూడా సూక్ష్మంగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలనే ఆలోచనకు వచ్చినట్లు సమాచారం.

ఇకపై పక్కాగా..

భూములకు సంబంధించిన రికార్డులన్నీ తహసీల్దార్ కార్యాలయాల్లోనే ఉన్నాయి. పహాణీలు మొదలు..పట్టాదారు పాసు పుస్తకాల నకలు, భూమిశిస్తు చెల్లించిన రసీదులు ఇలా ప్రతి రికార్డు అక్కడ ఉంటుంది. ఏదైనా భూమికి సంబంధించి వివాదం తలెత్తినప్పుడు ఈ రికార్డులనే ప్రామాణికంగా తీసుకుని, వాటిని పరిష్కరిస్తుంటారు. ఇందులో పొందుపర్చిన వివరాలను ఆధారం చేసుకునే తహసీల్దార్లు రిపోర్టులు తయారు చేస్తుంటారు. క్షేత్రస్థాయి అధికారులు ఇచ్చే ఈ రిపోర్టులే ధరణి దరఖాస్తుల పరిష్కారంలో కీలకం. పాతరికార్డుల్లో ఉన్న వివరాలకు భిన్నంగా కొన్ని రిపోర్టులు ఉంటున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. భూమి పూర్వాపరాలు పరిశీలించకుండా కలెక్టర్లు కూడా వారిచ్చే రిపోర్టులపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఒక్కోసారి కలెక్టర్లు కూడా వీటిని గుడ్డిగా ఆమోదించి.. ఆ తర్వాత న్యాయపరమైన చిక్కులను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఆన్‌లైన్ రిపోర్టులతో పాటు ఆఫ్‌లైన్ రికార్డులను పరిశీలించడం ద్వారా వీటికి చెక్‌పెట్టొచ్చని కలెక్టర్ భావిస్తున్నారు. ఆ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ప్రస్తుతం జిల్లా ధరణి పోర్టల్‌లో 35 వేలకుపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. కలెక్టర్ ఆశించిన విధంగా రిపోర్టులు తయారు చేసి పంపడం కూడా క్షేత్రస్థాయి రెవెన్యూ సిబ్బందికి తలకు మించిన భారంగా మారనుంది.

కేసును నీరుగార్చే ప్రయత్నం?

ఇదిలా ఉంటే ధరణి దరఖాస్తుల క్లియరెన్స్‌లో భాగంగా కలెక్టర్ ఇటీవల పలు దరఖాస్తులను పరిష్కరించాల్సి వచ్చింది. ఇదే అదనుగా భావించిన అక్రమార్కులు 53 కోర్టు కేసులు, రెండు పెండింగ్ మ్యూటేషన్లు, రెండు ల్యాండ్ మ్యాటర్స్, 16 అర్బన్ లాండ్ పట్టాదారు పాసు బుక్, 23 నిషేధిత జాబితావి, మూడు పాస్‌బుక్ డేటా కరెక్షన్ అప్లికేషన్లను క్లియర్ చేయించుకున్నారు. తహసీల్దార్లు పంపిన ఫిజికల్ రిపోర్టులు డి సెక్షన్ నుంచి ఇంకా కలెక్టర్ వద్దకు చేరకుండానే ఆ వివాదాస్పద మాడ్యుల్స్‌కు సంబంధించిన మరికొన్ని దరఖాస్తులు క్లియర్ అవ్వడాన్ని సీరియస్‌గా తీసుకున్న కలెక్టర్ ఆ తర్వాత అంతర్గత విచారణ చేపట్టారు. ధరణి కో ఆర్డినేటర్ నరేష్, ఆపరేటర్ రమేష్ అక్రమాలకు పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ మేరకు ఇదే అంశంపై ఆదిబట్ల పోలీసుస్టేషన్‌లోనూ లిఖిత పూర్వక ఫిర్యాదు చేయించారు. ఆయా దరఖాస్తులకు సంబంధించిన సమగ్ర వివరాలను అందజేయాలని కోరుతూ సీసీఎల్ఏకు లేఖ రాశారు. ఈనెల 5న ఈ అంశాన్ని గుర్తించి, కేసు నమోదు చేసి 15 రోజులు దాటినా వివాదాస్పద దరఖాస్తుల కక్లియరెన్స్ వెనుక దాగి ఉన్న అదృశ్య శక్తులను గుర్తించకపోవడాన్ని పరిశీలిస్తే అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అదుపులోకి తీసుకున్న అనుమానితులను సైతం ఆ తర్వాత వదిలివేయడాన్ని పరిశీలిస్తే.. ఉద్దేశపూర్వకంగానే కేసును నీరుగార్చే ప్రయత్నం జరుగుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

తప్పులు లేకుండా ఉండాలి

ఓటరు జాబితాపై డీఆర్‌ఓ సంగీత సమీక్ష



మాట్లాడుతున్న సంగీత

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రాబోయే లోక్‌సభ ఎన్నికలకు ఓటరు జాబితాను తప్పులు లేకుండా రూపొందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత సంబంధిత అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో శనివారం స్పెషల్ సమ్మరి రివిజన్ 2024పై తహసీల్దార్లు, ఏఎల్‌ఎంటీఎస్‌లతో ఓటరు జాబితా తయారుపై సమీక్ష నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా పటిష్టంగా రూపొందించాలన్నారు. 2024 జనవరి 1 నాటికి అర్హత గల ఓటర్లకు ఓటు హక్కు కలిప్తూ పక్కా నివేదిక రూపొందించాలని సూచించారు. ఫారం–6,7,8 లను బీఎల్‌ఓల ద్వారా ఓటర్లకు అందిస్తూ పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికకు కృషి చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం సిద్ధంగా ఉండాలని, ఓటర్ల సంఖ్య ఆధారంగా అదనంగా ఏర్పాటు చేయాల్సిన పోలింగ్ స్టేషన్లను ముందుగా గుర్తించాలని, ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు తొలగింపులు వంటివి చేపట్టాలన్నారు. స్పెషల్ సమ్మరి రివిజన్ 2024 ప్రకారం ఈనెల 20 నుంచి జనవరి 5 వరకు పోలింగ్ స్టేషన్ల పునర్వ్యవస్థీకరణ చేయాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న ఓటరు జాబితాలోని తప్పులను గుర్తించి సవరించే ప్రక్రియ చేపట్టాలన్నారు. చనిపోయిన వారి పేర్లను మరణ ధ్రువీకరణల ఆధారంతో జాబితా నుంచి తొలగించాలని తెలిపారు. బదిలీ అయిన వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఫొటోల మార్పు తదితర పనులను ఈనెల 20 నుంచి జనవరి 5 వరకు నిర్వహించడం జరుగుతుందని, జనవరి 6 నుంచి 22 వరకు డ్రాఫ్ట్ రోల్‌పై అభ్యంతరాలు, వాదనలను స్వీకరించడం జరుగుతుందని వివరించారు. ముఖ్య ఎన్నికల అధికారులు సూచించిన శని, ఆదివారాలల్లో స్పెషల్ క్యాంపెయిన్లను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఫిబ్రవరి 2న అభ్యంతరాలను పరిశీలించనున్నట్టు చెప్పారు. ఫిబ్రవరి 6న ఆరోగ్యవంతమైన తుది ప్రచురణ కోసం కమిషన్ అనుమతికి పంపించి వారి అనుమతి మేరకు ఫిబ్రవరి 8న తుది జాబితా విడుదల చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఆర్డీఓలు, తహసీల్దారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయంలో స్మార్ట్ ట్రాలీలు

శంషాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యం అందించే దిశగా స్మార్ట్ ట్రాలీలను అందుబాటులోకి తీసుకొచ్చారు. విమానాశ్రయంలోని ప్రవేశ మార్గాలు, విమానాల సమయాలు, సంబంధిత గేట్లకు సంబంధించిన మార్గాలు, షాపింగ్ చేసే వారికి ఉన్న ఆఫర్లు ఇతరత్రా సమాచారాన్ని ప్రయాణికులు స్మార్ట్ ట్రాలీ స్క్రీన్లపైనే తెలుసుకోవచ్చని ఎయిర్‌పోర్టు సీఈఓ ప్రదీప్ ఫణీకర్ పేర్కొన్నారు. స్మార్ట్ ట్రాలీలు నావిగేషన్ ఆధారంగా పనిచేస్తాయన్నారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా ఏర్పాటు చేసిన ట్రాలీలు మంచి ప్రయాణ అనుభూతిని కలిగిస్తాయన్నారు.

ఆకాశంలో అద్భుతం

ఉల్కా పాతాలను నేరుగా చూడొచ్చు

లక్డీకాపూల్: ఆకాశంలో అద్భుతాలను వీక్షించొచ్చు. శనివారం నుంచి ఐదు రోజుల పాటు వినీలాకాశంలో ఉల్కాపాతాలు కనువిందు చేయనున్నాయి. ఆకాశం నుంచి భూమిపైకి రాలే ఉల్కాపాతాలను ప్రజలంతా నేరుగా చూడొచ్చని ప్లానెటరీ సొసైటీ ఆఫ్ ఇండియా హైదరాబాద్ సంచాలకుడు శ్రీరఘునందన్ కుమార్ పేర్కొన్నారు. రాత్రి 9 నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకూ వేర్వేరు సమయాల్లో కాంతివంతమైన ఉల్కాపాతాలు కనిపిస్తాయన్నారు. పాథియాన్ అనే గ్రహశకలం సూర్యుడి చుట్టూ తిరిగే క్రమంలో కొద్దినెలల క్రితం భూకక్ష్యలోకి ప్రవేశించింది. ఇది కొన్ని పదార్థాలతో కలిసి రాపిడికి గురై చిన్న చిన్న ఉల్కలుగా రాలిపడుతుంది. ఈ క్రమంలో ఇవి గంటకు 150 కాంతి పుంజాలను వెదజల్లుతాయని అంతర్జాతీయ ఉల్కాపాత సంస్థ (ఐఎంఓ) పేర్కొంది. ఉల్కాపాతాలు చూసిన వారు ఫొటోలు, వీడియోలు చిత్రీకరించి ఐఎంఓ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయొచ్చని వెల్లడించింది.

ఆసరా.. ఆహార భద్రత

రావాలి.. కావాలి.. రేషన్

- బహుళ ప్రయోజనకారి రేషన్ కార్డు
- మరోవైపు పింఛన్ పెంపు ప్రకటన
- ఇబ్బడిముబ్బడిగా అర్జీలు
- రెండింటికీ భారీ డిమాండ్
- కొత్త సర్కారుపై గంపెడాశలు

ఆహార భద్రత (రేషన్) కార్డు బహుళ ప్రయోజనకారిగా మారింది. కేవలం పీడీఎస్ బియ్యానికే పరిమితం కాకుండా రేషన్ కార్డు ప్రతి పథకానికి కుటుంబ బీపీఎల్ కార్డుగా పని చేయనుంది. ఇప్పటికే విద్యార్థులకు సంక్షేమ ఉపకార వేతనాల కోసం ఆదాయ ధ్రువీకరణ పత్రాల మంజూరు కోసం రేషన్ కార్డు తప్పనిసరి. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయబోయే ఆరు గ్యారంటీలు, మేనిఫెస్టోలో ప్రకటించిన సంక్షేమ పథకాల నేపథ్యంలో రేషన్ కార్డుకు ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు నెలవారీ నగదు పెంపుతో ఆసరా పింఛన్లకు సైతం ప్రాధాన్యం పెరిగింది. కొత్త పింఛన్లకు సైతం రేషన్ కార్డు తప్పనిసరిగా తయారైంది. ఇప్పటికే కార్డు ఉన్నవారు తహసీల్దార్ ఆఫీసుల్లో దరఖాస్తులకు ఉరుకులు పరుగులు చేస్తుండగా, లేనివారు కొత్త కార్డు కోసం సివిల్ సప్లయ్ సర్కిల్ ఆఫీస్, మీ సేవ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

–సాక్షి, సిటీబ్యూరో





చిగురిస్తున్న ఆశలు..

కొత్త రేషన్ కార్డులపై ఆశలు చిగురిస్తున్నాయి. కొత్త రేషన్ కార్డుల అంశం పరిశీలిస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఇటీవల ప్రకటించారు. గ్రేటర్ పరిధిలో సుమారు ఐదు లక్ష కుటుంబాలు కొత్త కార్డుల కోసం ఎదురు చూస్తున్నాయి. గత మూడేళ్లుగా దరఖాస్తుల స్వీకరణ ఆన్‌లైన్ లాగిన్ కూడా నిలిచిపోయింది. అప్పట్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల్లో కేవలం 40 శాతం మాత్రమే క్లియర్ కాగా మిగతా దరఖాస్తులను తిరస్కరించారు. మరోవైపు ఆరేళ్లుగా కార్డులో కొత్త సభ్యులు చేర్పులు, మార్పుల దరఖాస్తులకు అవకాశం ఉన్నప్పటికీ ఆమోద ప్రక్రియ మాత్రం లేకుండా పోయింది. దీంతో సుమారు 3 లక్షల వరకు దరఖాస్తులు పెండింగ్‌లో మగ్గుతున్నట్లు తెలుస్తోంది. కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడమే తరువాయి లాగిన్ పునరుద్ధరించే అవకాశాలున్నట్లు అధికారులు చెబుతున్నారు.

గ్రేటర్ పరిధిలో 17.22 లక్షలపైనే..

గ్రేటర్ పరిధిలో సుమారు 17. 22 లక్షల రేషన్ కార్డులు ఉండగా, అందులో 59 లక్షల సభ్యులు ఉన్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. జిల్లాలవారీగా పరిశీలిస్తే హైదరాబాద్‌లో 6,39,631 కార్డులు ఉండగా అందులో 23,64,956 మంది సభ్యులున్నారు. రంగారెడ్డి జిల్లాలో 5,58,452 కార్డులు ఉండగా, 18,23,288 మంది సభ్యులున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 5,23,959 కార్డులు ఉంగా అందులో 17,18,464 యూనిట్లు ఉన్నాయి.

మూడేళ్ల క్రితం దరఖాస్తు చేశాం..

మూడేళ్ల క్రితం మీ సేవ కేంద్రంలో రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేశాం. ఇప్పటి వరకు మంజూరు కాలేదు. బియ్యంతోపాటు ప్రతి ప్రభుత్వ సంక్షేమ పథకానికి దరఖాస్తు చేసేందుకు ఇబ్బంది అవుతోంది. కొత్త ప్రభుత్వం పేద కుటుంబాలకు రేషన్ కార్డులు మంజూరు చేసి ఆదుకోవాలి



– కృష్ణవేణి, బడంగ్‌పేట్

రేషన్ కార్డుతో ఆరోగ్యశ్రీ

రేషన్ కార్డుతో ఆరోగ్యశ్రీ అనుసంధానమైంది. ఇప్పటికే ఆరోగ్యశ్రీ– ఆయుష్మాన్‌భారత్ పథకం కింద అందించే ఉచిత చికిత్సలకు ఆహార భద్రత కార్డును కూడా చెల్లుబాటు చేస్తూ గత ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా.. తాజాగా ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ. 10 లక్షలకు పెంచుతున్నట్లు కొత్త సర్కారు ప్రకటించింది. పదేళ్ల క్రితం వైఎస్‌ఆర్ హయాంలో తెల్ల రేషన్ కార్డులున్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు చేసింది. తెలంగాణ ఆవిర్భావం అనంతరం రేషన్ కోసం తెల్ల కార్డు స్థానంలో ఆహార భద్రత కార్డులు వచ్చాయి. ఎఫ్‌ఎస్‌సీ కార్డులు కేవలం బియ్యానికే పరిమితమయ్యాయి. తాజాగా ఆరోగ్యశ్రీ – ఆయుష్మా భారత్‌లో చికిత్సలు పొందాలంటే తెల్ల రేషన్ కార్డు అయినా ఉండాలనే నిబంధనతో మరింత ప్రాధాన్యత పెరిగింది.

పురపాలికల్లో అవిశ్వాసం

అసెంబ్లీ ఎన్నికల తర్వాత మారిన రాజకీయ పరిణామాల ప్రభావం

- అవిశ్వాస తీర్మానాలకు సిద్ధమవుతున్న అసమ్మతి వర్గం
- ఆజ్యం పోస్తున్న కాంగ్రెస్ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు
- పావులు కదుపుతున్న హస్తం పార్టీ పెద్దలు



సాక్షి,మేడ్చల్ జిల్లా/ రంగారెడ్డి జిల్లా: నగర శివారు పురపాలికల్లో అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టే దిశగా వ్యూహరచన చేస్తుండటంతో.. పాలక వర్గాలు పదవిని కాపాడుకునేందుకు.. వైరి వర్గం నుంచి కుర్చీ దక్కించుకునేందుకు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నాయి. దీంతో మెజారిటీ పురపాలికల్లో అవిశ్వాస పరీక్షలు జరిగే అవకాశాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి.

- నగర శివారులోని మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో 7 కార్పొరేషన్లు, 22 మున్సిపాలిటీలు ఉన్నాయి. అధిక స్థానాల్లో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి గెలిచిన కౌన్సిలర్లు, కార్పొరేటర్లే చైర్మన్లు, మేయర్లు ఎక్కువగా కొనసాగుతున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 4 మున్సిపల్ కార్పొరేషన్లు, 9 మున్సిపాలిటీల్లో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నాయకులు మేయర్లు, చైర్మన్లుగా కొనసాగుతున్నారు.
- రంగారెడ్డి జిల్లాలో ఆదిబట్ల, తుర్కయాంజాల్, ఇబ్రహీంపట్నం, పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీల్లో చైర్మన్ పదవులు సహా బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. తుక్కుగూడ, ఆమన్‌గల్‌లో బీజేపీకి చెందిన నాయకులు చైర్మన్లుగా ఉన్నారు. జల్‌పల్లిలో ఎంఐఎం, మణికొండలో కాంగ్రెస్ అధికారాన్ని చెలాయిస్తున్నాయి. ఈ జిల్లాలో మిగిలిన బండ్లగూడ నగరపాలక సంఘాల మేయరుతో పాటు నార్సింగి, శంషాబాద్ తదితర మున్సిపాలిటీల్లో చైర్మన్లు బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నాయకులే ఉన్నారు.

అవిశ్వాసానికి ఉత్సాహం

అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో పురపాలికల్లో కీలక రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటంతో.. రాజకీయ సమీకరణలు కూడా జోరందుకున్నాయి. ఈ నేపథ్యంలోనే పురపాలికల్లో బీఆర్‌ఎస్ పాలకవర్గాలు ఉన్నచోట్ల అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు పలువురు కార్పొరేటర్లు/కౌన్సిలర్లు ఉత్సాహం కనబరుస్తున్నారు.

మేడ్చల్ జిల్లాలో ఇలా..

- నిజాంపేట్ నగరపాలికలో మొత్తం 33 మంది కార్పొరేటర్లు ఉండగా, డిప్యూటీ మేయర్‌తో సహా పలువురు కార్పొరేటర్లు మేయర్ తీరుతో అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో మేయర్ నిర్ణయాలు ఏకపక్షంగా ఉన్నాయంటూ.. గతంలో పలువురు కార్పొరేటర్లు బహిరంగంగా విమర్శలు చేశారు. మొత్తం 28 డివిజన్లలో మెజారిటీ కార్పొరేటర్లు అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. తమ డివిజన్లలో ఎలాంటి అభివృద్ధి జరగడంలేదని బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు పేర్కొంటుండటంతో జవహర్‌నగర్ రాజకీయం వేడెక్కుతోంది. బోడుప్పల్ కార్పొరేషన్‌లో 28 డివిజన్లు ఉండగా.. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరటంతో కార్పొరేషన్‌లో ఆ పార్టీ బలం పెరిగింది. ఇక్కడ మేయర్, డిప్యూటీ మేయర్ మధ్య విభేదాలు చాపకింద నీరులా కొనసాగుతున్నాయి. పలువురు కార్పొరేటర్లు కూడా సమయం కోసం వేచి చూస్తుండటంతో.. అవిశ్వాసానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.
- పీర్జాదిగూడ నగర పాలక సంస్థలో 26 డివిజన్లు ఉండగా, మేయర్, డిప్యూటీ మేయర్, పలువురు కార్పొరేటర్ల మధ్య కోల్డ్ వార్ నడుస్తోంది. దీంతో ఎవరికి వారు పలువురు కార్పొరేటర్లను మచ్చిక చేసుకునే ప్రయత్నంలో భాగంగా అవిశ్వాసానికి రంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.
- మేడ్చల్ పురపాలికలో గత కొంత కాలంగా మున్సిపల్ చైర్‌పర్సన్ తీరుపై ఆ పార్టీకి చెందిన కౌన్సిలర్లు గుర్రుగా ఉన్నారు. గుండ్లపోచంపల్లి, దమ్మాయిగూడ, పోచారం, దుండిగల్, కొంపెల్లి పురపాలికలలో బీఆర్‌ఎస్ పార్టీలో చైర్మన్లు, కౌన్సిలర్ల మధ్య అంతర్గత విభేదాలు కొనసాగుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల తర్వాత మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో పలువురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో చైర్మన్లపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు.. ఆయా మున్సిపాలిటీల్లో కౌన్సిలర్లు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

అసెంబ్లీ ఎన్నికల దరిమిలా..

నగర శివారులోని 14 నియోజకవర్గాల్లో అసెంబ్లీ ఎన్నికల దరిమిలా పలు రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, కల్వకుర్తి స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించగా, మిగతా 11 నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలిచింది. కాంగ్రెస్ గెలుపొందిన మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఇబ్రహీంపట్నం, పెద్ద అంబర్‌పేట, ఆదిభట్ల, తుర్కయాంజాల్, షాద్‌నగర్, కొత్తూరు, ఆమనగల్లు పురపాలక సంఘాలు ఉండగా, మిగతా 15 పురపాలక సంఘాలు మాత్రం బీఆర్‌ఎస్ గెలుపొందిన అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉన్నాయి. బీఆర్‌ఎస్ పాలకవర్గం కొనసాగుతున్న కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లోనూ వర్గపోరు కొనసాగుతుండటంతో అవిశ్వాస తీర్మానాలకు సిద్ధమవుతున్నారు. బీఆర్‌ఎస్ పార్టీలో కొనసాగుతున్న వర్గపోరుకు అగ్గికి ఆజ్యం పోసినట్లుగా.. కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు కార్పొరేటర్లు, కౌన్సిలర్లతోపాటు ఆపార్టీ పెద్దలు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.

వాక్ ఫర్ హెల్త్

ఖైరతాబాద్: ప్రజల్లో ఆరోగ్య చైతన్యమే లక్ష్యంగా తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (టీటీఏ) ఆధ్వర్యంలో శనివారం ఉదయం వాక్ ఫర్ హెల్త్ ఫర్ ఆల్ అనే నినాదంతో 5కే రన్ నిర్వహించారు. పీపుల్స్ ప్లాజా వేదికగా నిర్వహించిన రన్‌ను ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. టీటీఏ ప్రతిష్టాత్మకంగా హైదరాబాద్‌తో పాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని నింపగలిగితే సమాజానికి ఎంతో మేలు చేకూరుతుందన్నారు. పీపుల్స్ ప్లాజా వేదికగా ప్రారంభమైన 5కే రన్‌లో భారీ సంఖ్యలో యువతీ యువకులు పాల్గొన్నారు.



జెండా ఊపి రన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

PUBLIC NOTICE

The General Public at Large is hereby informed that My Client Smt. Kandukuri Shashikala W/o Sambamurthy, H.No.: 5-7-604, APHB COLONY, KARIMNAGAR - 505001, Aadhar No.: 3612 1248 7160, has entered into an Agreement of Sale Dt. 16.05.2023 with the Title holder, Sri GOURISHETTI SANTHOSH S/o G. Prabhakar, 2-3-763/1, Flat No. 504, Sai Balaji Apartments, Sai Baba Temple, Golnaka, Amberpet, Hyderabad, Telangana - 500013 in Respect of the Agricultural Land mentioned in the SCHEDULE OF THE PROPERTY as stated below. If Any person or persons claiming to have any Legal Title/Right/ Interest/Claims in the said property, either as Owner or in any other capacity in the Scheduled Property, may lodge their objection with Documentary Proof, within 10 days from the date of publication of this notice with the undersigned, failing which My client shall proceed with registration of Sale Deed and any claims thereafter will be considered as waived.

SCHEDULE OF THE PROPERTY

ALL THAT THE PART AND PARCEL OF THE AGRICULTURAL LAND IN SURVEY No. 120/ఆ2/1/1/2 admeasuring Ac. 0-04 Gts, TOLKATTA Village, Moinabad Mandal, Ranga Reddy District, T.S and bounded by **East:** Land of MD Thaher in Sy No.120, **West:** 15 Feet Road, Land of Lalitha & Suvarna in Sy No.120, **North:** 10 Feet Road, land of Gourishetti Santhosh in Sy No.120, **South:** Land of Sumanth in Sy No.120

Sd/- **P. VENKATA KEDARNATH**
Advocate
Flat No. 206, Mourya Towers, Street No. 6, Adikmet Main Road, Vidya Nagar, Hyderabad 500044. Ph: +91-9059199998, 9573507454
Hyderabad, Date:16.12.2023

PUBLIC NOTICE

The General Public is hereby informed that my client Mr. D. Girivardhan Reddy S/o. Mr. D. Laxma Reddy, Age 48, Occ: Business, R/o. Suvela Sukethan Kompally, Medchal 500102, is the owner of all that the Residential Flat bearing No. 502, in Fifth Floor, in the complex known as **"Raaga Residency"**, with plinth area 1652 Sq. Ft., (including common areas and car parking) along with proportionate undivided share of land admeasuring 100 Sq. Yards, out of total admeasuring 1000 Sq. Yards constructed on Plot Nos. 15/A & 15/B, in Survey Nos. 41/Part and 43 situated at Bandlaguda Jagir Village and Gram Panchayat, Gandipet Mandal, Ranga Reddy District under Registered Partition deed bearing Doc. No. **12439/2019** (Septuplicate), my client while travelling from Shamshabad to Shabad on 10.09.2023 with the said partition deed document of the said flat my client lost Septuplicate partition deed document bearing No. **12439/2019** registered at SRO Gandipet dated 02.11.2019 executed by and between 1. Mrs. Challa Anuradha & 8 others. And My client registered police complaint at Shabad Police station dated 29.10.2023. On receipt of the complaint efforts were made to trace out the missing Govt. Records, but could not be traced.

Therefore my client through this notice inform the general public at large that the document shall not be used/Misused my purpose by anybody and it anybody doing so, the same will be at this own risk and if anybody is having any claim on the property may approach the under sign within (7) days from the publication.

Sd/- V MAHENDER REDDY, Advocate,
R/o: Plot No. B-57, Phase-II, Allwyn Colony, Kukatpally Hyderabad-500072, Ph: 9440538936

మంత్రి సీతక్కకు శుభాకాంక్షలు


శుభాకాంక్షలు యూనియన్ నేతలు, ఉద్యోగులు

ఇబ్రహీంపట్నం: పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కను పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ నేతలు శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి. ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం చంద్రశేఖర్‌తోపాటు పలువురు ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ఏకాగ్రత

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని శివమారుతీ గీతా అయ్యప్పమందిరంలో శుక్రవారం రాత్రి అయ్యప్పస్వామి మహాపడి పూజను ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే దేవాలయంలో గురుస్వామి సతీషన్ నాయర్, గిరీషన్ నాయర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మణికంఠునికి అష్టాభిషేకం, శివలింగానికి అన్నాభిషేకం, గణపతిపూజ, హోమాలను నిర్వహించారు. అర్ధరాత్రి వందనం కార్యక్రమం చేశారు. పూజకు హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ... భక్తిభావాన్ని పెంపొందించుకోవాలన్నారు. భక్తితోనే ముక్తి లభిస్తుందని తెలిపారు. ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుంటే మనస్సు ఏకాగ్రతతో ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కన్యస్వాములతో పరిగిరోడ్డులోని పోచమ్మ దేవాలయం నుంచి శివమారుతీ గీతాఅయ్యప్పమందిరం వరకు మహాదీపారాధనతో ఊరేగింపు నిర్వహించారు. విద్యుత్ దీపాలు, రకరకాల పూలతో రథాన్ని సర్వాంగసుందరంగా అలంకరించి రథంపై అయ్యప్పస్వామి చిత్రపటంతో ఊరేగింపు చేశారు. కేరళ మేళతాళాల వాయిద్యం, ఆట పాటలు చూపరులను ఆకట్టుకున్నాయి.


పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్

18న వెసెక్టమీ క్యాంపు

ఇబ్రహీంపట్నం: కుటుంబ నియంత్రణలో పురుషులను భాగస్వామ్యం చేయడం కోసం వెసెక్టమీ క్యాంపును 18న ఇబ్రహీంపట్నం ప్రభుత్వాసుపత్రిలో నిర్వహిస్తున్నట్లు సంబంధిత వైద్యాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. కోత, కుట్టు లేకుండా పది నిమిషాల లోపు చేసే చిన్న ఆపరేషన్ వెసెక్టమీ అని వెల్లడించారు. ఆపరేషన్ అయిన వెంటనే ఇంటికి వెళ్లి పనులు చేసుకోవచ్చునని, నపుంసకత్వం రాదని తెలిపారు. వెసెక్టమీ ఆపరేషన్ చేయించుకున్న పురుషులకు రూ.1100లు, ప్రోత్సహించిన వారికి రూ. 200లు పారితోషికం ఇవ్వనున్నట్లు చెప్పారు. వివరాలకు సమీపం ఆశ కార్యకర్తను, ఎఎన్ఎంలను, వైద్యాధికారిని సంప్రదించవచ్చునని తెలిపారు.

ఆటో కార్మికుల ధర్నా

మంచాల: మంచాల మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆటో యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఆటో కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆటో నడుపుకొని జీవించే ఆటో కార్మికులకు పూట గడవని దుస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ఆటో నడుపుకొని కుటుంబ పోషణ సాగించే నిరుపేదల బతుకులు రోడ్డున పడ్డాయన్నారు. బ్యాంకుల్లో అప్పులు చేసి ఆటోలు కొనుకొని, ఈఎంఐలు కూడా చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణమే ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు వేణుగోపాల్‌రావు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు